
సందేశం

**2017 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు**

దేశవ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ వారాన్ని ఘనంగా జరపండి!

# ప్రజాయుద్ధంలో నేలకొరిగిన

# అమరులకు అరుణాంజలి ఘటించండి!



## విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో

## భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న

## మిషన్-2017ను ఓడించండి!

## పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ

## ఉద్యమాన్ని పురోగమింపజేద్దాం!

పీడిత ప్రజల విముక్తికి నక్సల్బరీ చూపిన ప్రజాయుద్ధ బాటే

ఏకైక మార్గమని చాటండి!

కేంద్రకమిటీ,

సి.పి.ఐ. (మావోయిస్టు)

సందేశం

**2017 జులై 28 నుండి ఆగస్టు 3 వరకు**

**దేశవ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ వారాన్ని ఘనంగా జరపండి!**

# ప్రజాయుద్ధంలో నేలకొరిగిన అమరులకు అరుణాంజలి ఘటించండి!

## విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో

## భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న

## మిషన్-2017ను ఓడించండి!

## పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ

## ఉద్యమాన్ని పురోగమింపజేద్దాం!

**పీడిత ప్రజల విముక్తికి నక్సల్బరీ చూపిన ప్రజాయుద్ధ బాటే ఏకైక మార్గమని చాటండి!**

**కామ్రేడ్స్, విప్లవ ప్రజలారా!**

ప్రజల కోసం మరణించడం హిమాలయ శిఖరాల కన్నా ఉన్నతమైంది. దోపిడి వర్గాల కోసం మరణించడం ఈక కన్నా తేలికైంది. మానవులకు అన్నింటి కంటే విలువైంది ప్రాణం. సామాజిక విప్లవం కోసం, ప్రజా ప్రయోజనాల కోసం కమ్యూనిస్టు విప్లవకారులు సంపూర్ణంగా అంకితమవుతారు. లక్ష్యసాధన కోసం వారు అకుంఠిత దీక్షతో పనిచేస్తూ తమ ప్రాణాలతో పాటు సర్వస్వాన్నీ అర్పిస్తారు. ప్రతి గొప్ప మార్పు త్యాగాన్ని కోరుతుంది. వర్గాలు ఏర్పడినప్పటి నుండీ సమాజ చరిత్రంతా వర్గ పోరాట చరిత్రే అన్నది ఎంత వాస్తవమో, వర్గ పోరాటాల చరిత్ర అంతా త్యాగాల చరిత్రే అన్నది కూడా అంతే వాస్తవం.

మన దేశంలో మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుండి మొదలుకొని గత 50 సంవత్సరాలుగా కొనసాగుతోన్న నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో పార్టీ ఉన్నత స్థాయి నాయకత్వం నుంచి సాధారణ కార్యకర్తలు, విప్లవ ప్రజానీకం వరకూ సుమారు 15 వేల మంది తమ అమూల్యమైన జీవితాలను త్యాగం చేశారు. మన పార్టీ సంస్థాపకులు, గొప్ప నాయకులు, ఉపాధ్యాయులు, అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్ చటర్జీలు రూపొందించిన దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో లక్ష్యసాధనకై మునుముందుకు సాగుతూ వారు తమ ప్రాణాలు అర్పించారు. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, వారి నిర్దేశత్వంలో భారత పాలకవర్గాలు తీవ్రతరం చేసిన దేశవ్యాప్త ఫాసిస్టు, బహుముఖ దాడి, ప్రజలపై యుద్ధం – 'ఆపరేషన్ గ్రీన్ హంట్'లో గడచిన 2016 జులై నుంచి 2017 మే వరకు 205 మంది కామ్రేడ్స్, విప్లవ ప్రజానీకం తమ అమూల్యమైన

ప్రాణాలను అర్పించారు. వీరిలో సిసి కామ్రేడ్స్ ఇద్దరు, దండకారణ్యం-131 మంది, బీహార్-ఝార్ఖండ్-27 మంది, ఆంధ్ర-ఒడిశా బార్డర్-35 మంది, ఒడిశా-ఆరుగురు, తెలంగాణ-ఒకరు, పశ్చిమబెంగాల్-ఇద్దరు, పశ్చిమ కనుమలలో ఒకరు ఉన్నారు. ఇందులో 54 మంది మహిళా కేడర్లు, గ్రామీణ మహిళలు ఉన్నారు.

కామ్రేడ్ చారు మజుందార్ అమరత్వం చెందిన జులై 28 వేలాది ప్రజావీరులను స్మరించుకునే రోజు. ఈ సంవత్సర కాలంగా అమరులైన వారితో పాటు, నక్సల్బరీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా, ఈ ఐదు దశాబ్దాల కాలంలో అమరులైన వారందరి స్మృతిలో జులై 28 నుంచి ఆగస్టు 3 వరకూ అమరుల సంస్మరణ వారోత్సావాలను ఘనంగా జరపాల్సిందిగా మన పార్టీ కేంద్రకమిటీ పిలుపు నిస్తోంది.

ఈ సంవత్సర కాలంలో భారత విప్లవ నాయకులు, మన పార్టీ కేంద్రకమిటీ మరియు పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ (విజయ్‌దా) (80), కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ కుప్పు దేవరాజ్ (రమేష్, యోగేష్) (62)ల అమరత్వం విప్లవోద్యమానికి తీరని నష్టం. తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యం కోసం కోజికోడ్ వెళుతున్న కామ్రేడ్స్ దేవరాజ్, అజితలను 'ఆపరేషన్ బ్రహ్మగిరి'లో భాగంగా అరెస్టు చేసిన శత్రు కేంద్ర-రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారులు తీవ్ర చిత్రహింసలకు గురిచేసి నవంబర్ 24న కేరళ రాష్ట్రం నీలంబూర్ అటవీ ప్రాంతంలో కాల్చి చంపారు. కామ్రేడ్ నారాయణ్ సన్యాల్ కేన్సర్ వ్యాధితో ఏప్రిల్ 16న కోల్‌కతాలో తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బీహార్-ఝార్ఖండ్ (బిజె)లో సీనియర్ కామ్రేడ్ రఘునాథ్ మహతో, కామ్రేడ్ ఆశీష్ యాదవ్, పశ్చిమ బెంగాల్ (డబ్ల్యుబి)లో కామ్రేడ్ హిమాద్రి రాయ్ (సోమెన్‌దా, బిధాన్‌దా), ఆంధ్ర-ఒడిశా బార్డర్ (ఏఓబి)లో కామ్రేడ్స్ ప్రసాద్, దయ, పశ్చిమ కనుమల (డబ్ల్యుజి)లో కామ్రేడ్ అజిత (కావేరి) అమరులయ్యారు. అలాగే రీజనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ సంగ్రామ్ ముర్మూ (బిజె), జిల్లా కమిటీ సభ్యులు ఏఓబిలో కామ్రేడ్స్ ప్రభాకర్, కిరణ్, బిజెలో కామ్రేడ్స్ ప్రిన్స్ (కంపెనీ-1, ఈఆర్‌సి), సుదయ్ (మధ్య జోన్), యతీన్ (కోయల్-శంఖ్), శైలేష్, అజిత్ యాదవ్, దండకారణ్యం (డికె)లో కామ్రేడ్స్ జగత్ (పశ్చిమ బస్తర్), పాలీ (దర్భ), కైలాశ్ (తూర్పు బస్తర్), సబ్‌జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ నాగేంద్ర యాదవ్ (బిజె); ఏరియా కమిటీ/ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు 33 మంది (ఇందులో పిఎల్‌జిఏకు చెందిన అనేక మంది దళం/సెక్షన్, ప్లాటూన్ కమాండర్లు, డిప్యూటీ కమాండర్లు ఉన్నారు), గ్రామ పార్టీ కమిటీలు, విప్లవ ప్రజా కమిటీల (ప్రభుత్వాల) నాయకులు నలుగురు, ప్రజా మిలీషియా కమాండర్లు 8 మంది, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు 7 గురితో పాటు పదుల సంఖ్యలో పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా పోరాట యోధులు, పార్టీ కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు, విప్లవ ప్రజలు మొదలైనవారు ప్రజాయుద్ధంలో అమరులయ్యారు. జైలులో అధికార్ల నిర్లక్ష్యం వల్ల అనారోగ్యంతో ఇద్దరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

వీరిలో అనేక మంది శత్రువు జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్లలో, కోవర్టు ఆపరేషన్లలో, బుఢా నది (కోయల్-శంఖ్, బిజె), తేలం తుమ్‌నార్ (పశ్చిమ బస్తర్, డికె) వంటి శత్రు ఆంబుష్‌లలో అమరులయ్యారు. పలామూ (బిజె)లో విప్లవ ప్రతీఘాతక హంతక ముఠా టిపిసి దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. శత్రు బలగాలతో జరిగిన రాంగూడ (ఏఓబి), బుఢా నది (బిజె) వంటి ఎన్‌కౌంటర్లలో నాయకత్వ కామ్రేడ్స్‌తో పాటు మన గెరిల్లా బలగాలు వీరోచితంగా పోరాడుతూ తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి మన పార్టీ నాయకత్వాన్నీ, కేడర్లనూ రక్షించారు. శత్రు పారా మిలటరీ బలగాలపై అత్యంత సాహసోపేతంగా నిర్వహించిన సోన్‌దహా (బిజె) ఆంబుష్‌లో పైన పేర్కొన్న కామ్రేడ్స్ ప్రిన్స్, సుదయ్‌లతో పాటు కామ్రేడ్ విపిన్, బుర్కాపాల్ (డికె) ఆంబుష్‌లో కామ్రేడ్స్ అనిల్ (పిఎల్-24 కమాండర్, దర్భ), రవి (చర్ల ఎల్‌ఓఎస్ కమాండర్, ఖమ్మం, తెలంగాణ) అమరులయ్యారు. వృద్ధాప్యం, అనారోగ్యం, పాముకాటు తదితర కారణాలతో మరి కొందరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

అలాగే మహిళా కేడర్లలో ఏఓబిలో కామ్రేడ్స్ మమత, లత (భారతి) వంటి సీనియర్ పార్టీ కార్యకర్తలు, బుద్రి, మంజుల (ఉంగి); డికెలో కామ్రేడ్స్ హేమ్లా అంజు (దక్షిణ బస్తర్), రాంశిల (అర్‌కెబి), దర్భలో కామ్రేడ్స్ సుక్కి, జోగి, తూర్పు బస్తర్‌లో కామ్రేడ్స్ జగ్‌బత్తి యాదవ్ (సోనీ), రాజ్‌బత్తి; బిజెలో కామ్రేడ్ అనుప్రియ (కోయల్-శంఖ్) మొదలైనవారు శత్రు బలగాలతో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. హేమ్లా అంజు, పొడియం సుక్కి, దూధి గుడ్డి, రత్న, అడమే అనే మహిళా కామ్రేడ్స్‌ను, జ్యోతి గావడే, హేమ్లా సుకుమతి అనే గ్రామీణ మహిళలను పోలీసులు పట్టుకొని సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ నరహంతకులు వీరిలో కొంతమంది కామ్రేడ్స్‌ని హత్య చేసిన తర్వాత ఉన్మాదపూరితంగా గుప్తాంగాలతో అమానవీయంగా వ్యవహరించారు.

వీరంతా ఆపరేషన్ గ్రీన్ హంట్ మూడవ దశలో మిషన్ 2016, మిషన్ 2017లలో మున్నెన్నడూ లేని విధంగా కొనసాగుతున్న ప్రభుత్వ సాయుధ బలగాల దాడులను తిప్పికొట్టే క్రమంలో తమ ప్రాణాలను ధారపోసిన ప్రజావీరులు, మృత్యుంజయులు. వీరిలో అగ్రశ్రేణి నాయకత్వం సుదీర్ఘ కాలం నుంచి ఎన్నో ఆటుపోట్లను, ఎగుడు-దిగుళ్లను, మలుపులు-మెలికలనూ అధిగమిస్తూ పార్టీ పంథాకు కట్టుబడి తమ తుదిశ్వాస వరకూ నిలిచారు. వీరు ప్రజల, పార్టీ ప్రయోజనాలే తమ ప్రయోజనాలుగా ఎంచి స్వార్థాన్ని త్యజించిన అమరులు. అత్యున్నతమైన కమ్యూనిస్టు విలువలను, ఆదర్శాలను, సాహసాన్ని, అంకిత భావాన్ని, నిబద్ధతను ప్రదర్శించారు. ప్రజాయుద్ధంలో అసువులు బాసిన ఈ అమరులందరికీ కేంద్రకమిటీ తలవంచి వినమ్రంగా జోహార్లర్పిస్తోంది. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా కొనసాగుతున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేందుకు ఆ అమరులు చూపిన అరుణారుణ బాటలో తుది వరకూ పోరాడుతామని శపథం చేద్దాం. చొరవ, ధైర్యసాహసాలతో, త్యాగనిరతితో,

బోల్షివిక్ స్ఫూర్తితో ఉద్యమాన్ని మరో అడుగు ముందుకు వేయిద్దాం. అమరుల సంస్మరణ వారం సందర్భంగా వీరందరినీ పేరు పేరునా స్మరించుకుంటూ వారి ఆచరణ నుంచి నేర్చుకుందాం. వారి ఆదర్శాలను పార్టీ శ్రేణుల, ప్రజల ముందు నిలిపి విప్లవంలో తమ వంతు పాత్ర నిర్వహించేలా ప్రేరణను అందిద్దాం.

దేశంలో మన పార్టీ సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమంపై బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫాసిస్టు దాడి ఈ సంవత్సరం మరింత తీవ్రతరమైంది. ఈ ప్రతీఘాతుక భీషణ సైనిక అణచివేత దాడిని ఎప్పటికప్పుడు నూతన ఎత్తుగడలతో, సామాజిక, ఆర్థిక, రాజకీయ, నిర్మాణ, ప్రచార రంగాలలో సాయుధంగా తిప్పికొడుతూ ఉద్యమం నిలదొక్కుకుంటున్నది. దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్, ఏఓబి, ఒడిశా, పశ్చిమ కనుమలు, తదితర విప్లవోద్యమాల్ని తీవ్రంగా నష్టపరిచేందుకు పాలక వర్గాలు అమలు చేసిన మిషన్ 2016ను విఫలం చేశాం. ఇప్పుడు తిరిగి దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతోనే కొనసాగుతున్న మిషన్ 2017లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విప్లవ ప్రతీఘాతుక పథకాల్ని తిప్పికొట్టేందుకు కృషి చేస్తున్నాం. ఈ కృషి అంతటిలో అడుగడుగునా అమరవీరుల, విప్లవ ప్రజల త్యాగాలు ఇమిడి ఉన్నాయి. వారు తమ నెత్తుటి తర్పణతో ప్రజాయుద్ధంలో మన పార్టీకీ, ప్రజలకు విజయాలు చేకూర్చారు. ఈ నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సంవత్సరం తాము సాగించిన విప్లవ ప్రతీఘాతుక దాడిలో సాధించిన విజయాలపై ఆధారపడి రానున్న రెండు–రెండున్నర సంవత్సరాల్లో, అంటే 2018 సంవత్సరం చివరికి లేదా 2019లో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల నాటికి భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించాలని సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో మరో దుష్ట పథకాన్ని రూపొందించాయి.

మన పార్టీని బలోపేతం చేసేందుకు గత మూడు సంవత్సరాలుగా పార్టీలో కొనసాగించిన బోల్షివీకరణ క్యాంపెయిన్ కారణంగా పార్టీ శ్రేణుల సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెరిగింది. శత్రుదాడిని తిప్పికొట్టగలమనే విశ్వాసం పెరగడంతో ప్రజాయుద్ధంలో వారి క్రియాశీలత పెరిగింది. దీంతో పార్టీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని అధిగమించే లక్ష్యంతో వారు ప్రజలను తమ దైనందిన, సామాజిక, రాజకీయ మౌలిక సమస్యలపై, రాజ్యహింసకు వ్యతిరేకంగా కదిలించడం పెరిగింది. వర్గ పోరాటం తీవ్రతరం కాసాగింది. శత్రు బలగాలకు వ్యతిరేకంగా మన పిఎల్‌జిఏ బలగాల సాయుధ ప్రతిఘటనలో కొంత మెరుగుదల వచ్చింది. ప్రజాపునాది బలోపేతం కాసాగింది. ప్రజలు శత్రు బలగాల దాడులను ప్రతిఘటిస్తున్నారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి తీసుకెళుతున్న పార్టీ, సంఘ కార్యకర్తలను విడిపించు కుంటున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో మన పార్టీ కార్యకర్తలను, ప్రజలను పోలీసు బలగాలు అత్యంత పాశవికంగా హత్య చేసినప్పుడు, మహిళలపై సామూహిక అత్యాచారాలు చేసినప్పుడు, అత్యాచారం జరిపి హత్య చేసినప్పుడు ప్రజల ప్రతిఘటన క్రమంగా పెరుగుతున్నది. వారి

శవాల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరిస్తూ పోలీసుస్టేషన్లకు తరలిస్తుంటే, ప్రజలు పోలీసుస్టేషన్లను చుట్టుముడుతున్నారు. అధికారులతో తీవ్రంగా ఘర్షణపడి అమరుల శవాలను స్వాధీనం చేసుకొని, తమ గ్రామాలకు తీసుకొని వచ్చి విప్లవ సాంప్రదాయాలతో గౌరవప్రదంగా వారికి అంతిమ సంస్కారాలు చేస్తున్నారు.

**కామ్రేడ్స్!**

తీవ్రతరమౌతోన్న శత్రు ఫాసిస్టు దాడికి, దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ పెంపొందుతోన్న ఆర్థిక సంక్షోభానికి మధ్య గల గతితార్కిక సంబంధాన్ని మనం లోతుగా, సమగ్రంగా అర్థం చేసుకోవాలి. పెరుగుతోన్న శత్రు బలగాల దూకుడుతనానికీ, దేశంలో అధికార పగ్గాలు చేపట్టిన కరుడుగట్టిన బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తుల సామ్రాజ్యవాద ప్రయోజనాలకు మధ్య గల అంతస్సంబంధాన్ని స్పష్టంగా గ్రహించాలి. 2008 నాటి ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు సామ్రాజ్యవాద దేశాలు చేపట్టిన విధానాలన్నీ విఫలమైన ఫలితంగా అవి ప్రపంచవ్యాప్తంగా తమ దాడిని తీవ్రతరం చేశాయి. అందులో భాగంగా సామ్రాజ్యవాదుల దిశానిర్దేశంలో దేశంలో మోడీ ప్రభుత్వ హయాంలో దళారీ పాలకవర్గాలు సరళీకృత ఆర్థిక విధానాలను మరింత దూకుడుగా అమలుచేస్తున్నాయి. మోడీ–మోహన్ భాగవత్–అమిత్‌షాల ముఠా గత మూడు సంవత్సరాలుగా అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలన్నీ సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను అమలు చేయడానికి ఉద్దేశించినవీ, మన దేశంలో పీడిత వర్గాలకు, పీడిత జాతులకు, పీడిత సాంఘిక సముదాయాలకు వ్యతిరేకమైనవీ. ఇవి దేశంలో విశాల ప్రజారాశుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి.

'మేక్ ఇన్ ఇండియా,' 'స్టార్టప్ ఇండియా' పేరుతో దేశ అభివృద్ధి గురించి మోడీ ప్రభుత్వం ఊదరగొడుతున్నదంతా ప్రచార ఆడంబరమే. అది అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాలు గడిచినా దేశ పారిశ్రామిక రంగం కునారిల్లుతూనే ఉంది. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, వ్యవసాయ సంక్షోభం పెరిగి ఈ 'అభివృద్ధి' డొల్లను బహిర్గతం చేస్తున్నాయి. పేదరికం నిర్మూలన పేరుతో అది ముందుకు తెచ్చిన వివిధ పథకాలు విఫలమయ్యాయి. మోడీ ప్రభుత్వం ఇటీవల సుప్రీం కోర్టులో ఇచ్చిన వివరణ ప్రకారమే అకాల వర్షాలు, కరువు వల్ల, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం 12 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ సంక్షోభం తీవ్రతరమై పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో రైతులు అప్పుల మాఫీ, గిట్టుబాటు ధరలు, సబ్సిడీలను డిమాండ్ చేస్తూ మిలిటెంట్ పోరాటాలు చేస్తున్నారు.

మూడు సంవత్సరాల మోడీ పాలనలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు శక్తులు గోసంరక్షణ పేరుతో దేశవ్యాప్తంగా దళితులపై, ముస్లింలపై చేస్తున్న దాడులు పెరిగాయి. ప్రస్తుతం

దేశవ్యాప్తంగా గోవధను నిషేధించాలనేది మోడీ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లోని దాదరి నుండి మొదలుకుని సాహరన్‌పూర్, గుజరాత్‌లోని ఉనా, రాజస్థాన్‌లోని అల్వార్ వరకూ సాగిన ఈ దాడుల నేపథ్యంలో దళితులు, ముస్లింలతోపాటు ఆదివాసీ, ఇతర పీడిత కులాలకు చెందిన శక్తులు ఉనాలో సంఘటితమై హిందూ మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకున్నాయి.

ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు విస్థాపిత సమస్యపై మిలిటెంట్ పోరాటాలకు దిగుతున్నారు. ఝార్ఖండ్‌లో ఛోటా నాగపూర్ టెనన్సీ, సంథాలీ పెజంట్స్ టెనన్సీ (కౌలుదార్లు) చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆదివాసులు పెద్దఎత్తున పోరాటాలు కొనసాగిస్తున్నారు. తెలంగాణాలో 'హరిత హారం' పేరుతో ఆదివాసుల భూములను కబ్జా చేసుకునే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం బద్ధలైంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో గత సంవత్సర కాలంలో అనేకచోట్ల ఆదివాసుల విస్థాపన వ్యతిరేక పోరాటాలు మిలిటెంట్ రూపం తీసుకున్నాయి.

2015లో హైద్రాబాద్‌లో రోహిత్ వేముల ఆత్మహత్య, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకులపై 'దేశద్రోహం' కేసు మోపిన అనంతరం హిందూ ఫాసిస్టు దాడులను ఎదుర్కోవడానికి దేశవ్యాప్తంగా ప్రగతిశీల విద్యార్థుల, దళిత, ఆదివాసీ, మత మైనారిటీ విద్యార్థుల సమైక్య పోరాట వెల్లువ పెల్లుబికింది. అదే విధంగా ఈ సంవత్సరం ఢిల్లీలో రాంజస్ కాలేజీలో ప్రగతిశీల విద్యార్థులపై హిందూ సంఘ్ పరివార్ చేసిన దాడులకు వ్యతిరేకంగా 14 రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో పెద్దెత్తున విద్యార్థుల–ప్రొఫెసర్ల ఐక్య ఉద్యమం కొనసాగింది.

మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. వెలుగులో వచ్చిన లెక్కల ప్రకారం దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒక మహిళపై హింస జరుగుతున్నది. వరకట్న సమస్య వల్ల ప్రతి సంవత్సరం 8 వేల మంది మహిళలు మరణిస్తున్నారు, 50 వేల అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి, 40 వేల మంది మహిళలు అపహరణకు గురవుతున్నారు. యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, వేశ్యావృత్తిలోకి నెట్టడం, భ్రూణ శిశువులను–చిన్న వయస్సు ఆడపిల్లలను చంపడం పెద్దెత్తున భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి పెచ్చరిల్లిపోతున్న కారణంగానే జరుగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మహిళలు, ప్రజాస్వామికవాదుల ఉద్యమాలు జరుగుతున్నాయి.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అది దేశాన్ని పూర్తిగా సామ్రాజ్యవాద పెట్టుబడులకు దాసోహం చేస్తున్నది. మరోవైపు జాతీయోన్మాదాన్నీ, కుహనా దేశభక్తినీ రెచ్చగొడుతున్నది. ఈ ప్రతీఘాతుక విధానాలను వ్యతిరేకించిన సంస్థలపై, మేధావులపై

'దేశద్రోహం' చట్టాన్ని ప్రయోగిస్తున్నది. ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులపై హిందూత్వ గ్యాంగులు విచ్చలవిడిగా దాడులు చేయడానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక, నిజమైన దేశభక్తయుత శక్తులు పోరాడుతున్నాయి.

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలో దేశవ్యాప్తంగా గత సంవత్సరం సెప్టెంబర్‌లో 15 కోట్ల మందికి పైగా కార్మికులు దేశవ్యాప్త సమ్మె చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న 10 లక్షల మంది ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు కార్మిక చట్టాల సంస్కరణలతో పాటు ఔట్‌సోర్సింగ్ వంటి ఇతర ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సాధారణ సమ్మె చేశారు. అయితే మిలిటెంట్‌గా సాగుతున్న కార్మికోద్యమాలకు నాయకత్వం లేకుండా దెబ్బతీసేందుకు పాలక వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. మారుతీ సుజుకీ కంపెనీలో కార్మిక నాయకత్వాన్ని జైళ్లల్లోకి నెట్టి వారికి జీవిత ఖైదు విధించారు. కార్మికవర్గం దీన్ని సమైక్యంగా తిప్పికొట్టాలి.

సామ్రాజ్యవాదుల, బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం దేశాన్నంతటినీ ఒకే ఏకీకృత మార్కెట్‌గా తీర్చిదిద్దడం కోసం రాష్ట్రాల అధికారాలను కాలరాచివేస్తూ పరోక్ష పన్నుల విధానాన్ని సవరించి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశ పెట్టారు. అవినీతిని నిర్మూలించడమనే మోసపు ప్రచారంతో పెద్దనోట్లను రద్దుచేసి ప్రజల సొమ్మునంతటినీ బ్యాంకుల్లో జమ చేయించారు. ఒక పక్క కార్పొరేట్ ఘరానాల జేబులు నింపారు. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థల నిధులను భారీగా పెంచారు. పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని, రైతాంగాన్ని, చిన్న వ్యాపారస్థుల్ని, చిన్న పెట్టుబడిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు.

గత సంవత్సరం జులైలో భారత సైనిక బలగాలు హిజ్‌బుల్ ముజాహిద్దీన్ సంస్థకు చెందిన బుర్హాన్‌వానిని కాల్చి చంపినప్పటి నుంచి మొదలైన కాశ్మీర్ జాతి విముక్తి పోరాట వెల్లువ ఈ సంవత్సరం మే నెలలో అతని సహచరుడు సబ్జార్ అహ్మద్ భట్‌ను హత్య చేసిన తరువాత కూడా కొనసాగుతున్నది. కశ్మీర్ ప్రజలు 'రాళ్ల'తో భారత సైనిక, పారామిలిటరీ బలగాలతో యుద్ధం చేస్తూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలను బెంబేలెత్తిస్తున్నారు. ఈ సంవత్సర కాలంగా విద్యార్థినీ విద్యార్థులు కూడా అత్యంత సమరశీలంగా ఇందులో భాగమయ్యారు. ఈశాన్య భారతంలోని జాతి విముక్తి పోరాట సంస్థలు తిరిగి సంఘటితపడి, ఐక్యసంఘటనగా ఏర్పడి భారత విస్తరణవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి.

కాబట్టి దేశంలోని కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజలు, జాతీయ పెట్టుబడిదారులు, పీడిత జాతులు, మత మైనారిటీలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, విద్యార్థి యువజనులు తదితరులు అందరూ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే స్థితి నెలకొంది. దేశంలో ఒక స్పష్టమైన శక్తుల సమీకరణ జరుగుతోంది. సామ్రాజ్యవాద అనుకూల, పచ్చి

దేశద్రోహకర విధానాలతో, కాలం చెల్లిన ప్రగతి నిరోధక విధానాలతో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం పీడిత వర్గాలకు, జాతులకు, పీడిత సాంఘిక సముదాయాలకు ఉమ్మడి శత్రువుగా తయారయింది. దీనికి వ్యతిరేకంగా వివిధ రూపాలలో ప్రజా ప్రతిఘటన పెంపొందుతున్నది. ఇది మన దేశ రాజకీయాల్లో గత మూడు సంవత్సరాలలో జరిగిన నూతన పరిణామం.

**కామ్రేడ్స్,**

మన ప్రజా గెరిల్లాలు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మార్చి, ఏప్రిల్ మాసాలలో జరిపిన రెండు వేర్వేరు ఆంబుష్‌లలో 37 మంది సీఆర్‌పీ జవాన్‌లను అంతమొందించి మరో 10 మందిని గాయపర్చిన నేపథ్యంలో మే 8 నాడు కొత్త ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన నక్సల్ ప్రభావిత 10 రాష్ట్రాల ముఖ్యమంత్రుల, పోలీసు ఉన్నతాధికారుల, జిల్లా కలెక్టర్లతో అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఉద్యమ ప్రాంతాలలో భారత సైన్యాలను మోహరించే ప్రసక్తి లేదంటూనే సైనికాధికారుల మార్గదర్శకత్వంలో ఉద్యమ నిర్మూలనా పథకాలను రూపొందించారు. ఇందులో భాగంగానే సీఆర్‌పీఎఫ్ (ఎల్.డబ్ల్యు.ఇ.) సెంట్రల్ జోన్ కమాండ్ సెంటర్‌ను కలకత్తా నుండి రాయపూర్‌కు మార్చాలని; యూనిఫైడ్ కమాండ్లను జిల్లా స్థాయి వరకు ఏర్పరచి టాక్టికల్–ఆపరేషనల్ లెవల్‌లో కమాండ్లను పటిష్టం చేయాలని; రాష్ట్ర–కేంద్ర బలగాల మధ్య సమన్వయాన్ని మెరుగ్గా కొనసాగించడానికి కమిటీని ఏర్పరచాలని; రాయపూర్‌లో ఉన్న నక్సల్ ప్రత్యేక డీజీ కార్యాలయాన్ని జగదల్‌పూర్ (బస్తర్)కు మార్చాలని; ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత విస్తరించి పటిష్టం చేయాలని; ప్రత్యేకించి హ్యూమన్ మరియు ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్‌ను పటిష్టపరచాలని; ఎలక్ట్రానిక్ వ్యవస్థ (యుఎవిలు, సాటిలైట్స్, జిపిఎస్‌లు, థర్మల్ ఇమేజింగ్, ఇన్‌ఫ్రారెడ్ టెక్నాలజీ, సిసిటివి కెమెరాలు, రాడార్లు తదితరాల) ద్వారా రియల్‌టైం ఇంటెలిజెన్స్ సేకరణతో పాటు ఆపరేషన్స్‌లో ఈ వ్యవస్థను శక్తివంతంగా ఉపయోగించుకోవాలని; ఎయిర్ ఫోర్స్‌ను ఆపరేషన్స్‌లో కూడా వినియోగించాలని; (కమాండో బలగాలను హెలికాప్టర్లతో తరలించి దాడి చేయడంతో పాటు వాటి నుండే స్ట్రాఫింగ్ చేయడం, డ్రోన్ దాడులు చేయడం), బలగాలకు నూతన తరహా శిక్షణ ఇవ్వాలని; సుక్మా, బీజాపూర్‌లలో  కౌంటర్ ఇన్‌సర్జెన్సీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని; కేంద్ర–రాష్ట్ర బలగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని; ఉద్యమ ప్రాంతాల్లో రోడ్లను పారామిలటరీ బలగాల రక్షణలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకొని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని; మరిన్ని కమ్యూనికేషన్ టవర్లను నిర్మించాలని మొదలైన నిర్ణయాలు చేశారు. ఇకపై జాతీయ భద్రతా మండలి సలహాదారు అజిత్ డోభాల్, దేశ అంతర్గత భద్రతా సలహాదారు కె. విజయకుమార్‌లు మావోయిస్టుల నిర్మూలనా క్యాంపెయిన్‌ను గైడ్ చేస్తారని ప్రకటించారు. ఇందులో తీసుకున్న నిర్ణయాల్లో అతి ముఖ్యమైనది సర్జికల్ స్ట్రయిక్స్ చేయడం. ఇవన్నీ మిషన్ 2017లో భాగంగా ప్లాను ప్రకారం విప్లవ నాయకత్వాన్నీ, విప్లవ స్వీయాత్మక శక్తులనూ మట్టుబెట్టాలన్న లక్ష్యాన్ని వెల్లడిస్తున్నాయి.

ఇందులో భాగంగా 'తెల్లబట్టల' నక్సలైట్ల పేరుతో పౌరహక్కుల, సామాజిక కార్యకర్తలను, ప్రజాస్వామికవాదులను లక్ష్యంగా చేసుకుంటామని కూడా ప్రకటించారు.

మిషన్ 2017 చాలా దూకుడుగా హంతక దాడులతో ప్రారంభమైంది. 2017 మొదటి ఐదు మాసాలలోనే దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాల్లో 60 మంది గ్రామ స్థాయి (స్థానిక) నాయకత్వాన్ని, స్థానిక యాక్టివిస్టులను, విప్లవకారులను పోలీసులు హత్య చేశారు. మహిళలపై సామూహిక అత్యాచారాలు, హత్యలు, గృహ దహనాలు, అరెస్టులు, చిత్రహింసలు సల్వాజుడుం, సేంద్ర రోజుల నుంచి కేంద్రీకృతంగా, క్రూరంగా పెరిగాయి, పెరుగుతున్నాయి. విప్లవ ప్రజానీకానికీ, వారికి అండగా నిల్చిన మేధావులకు, ప్రజాస్వామిక శక్తులకు, వ్యాపారులకు దీర్ఘకాల కఠిన కారాగార శిక్షలు, విప్లవకారులకు ఉరిశిక్షలు విధిస్తున్నారు.

ప్రజా పోరాటాలను అణచివేయడానికి దోపిడీ పాలకవర్గాలు ఎంతటి క్రూర అణచివేతకు పాల్పడినా అంతిమంగా అది విఫలంకాక తప్పదనీ చరిత్ర పదే పదే రుజువు చేసింది. ఈ అనుభవంతో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న మిషన్-2017ను ఓడించడం, పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ ఉద్యమాన్ని పురోగమింపజేయడం తక్షణ కర్తవ్యంగా ప్రజాపునాదిపై ఆధారపడి ప్రజాయుద్ధాన్ని-గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలి. ఇందులో విజయం సాధించాలంటే, వీలైనంత వరకూ మన శక్తులను కాపాడుకోవాలి. శత్రు బలహీనతలను వినియోగించుకొని అవకాశం దొరికిన వెంటనే పిఎల్‌జిఏ బలగాలను కేంద్రీకరించి శత్రు బలగాల విడి యూనిట్లపై లేదా వాటిని విభజించి దాడి చేసి నిర్మూలించాలి, ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలి. ఇందుకోసం గెరిల్లా యుద్ధ నియమాలను, సూత్రాలు - రహస్యం, వేగం, దృఢసంకల్పం, స్థల మార్పిడిలతో కూడిన ఆత్మరక్షణ-దాడి ఎత్తుగడలను చొరవతో అమలు చేసి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం-విస్తృతం చేద్దాం. ఆత్మరక్షణ, ప్రజాపునాదిని పెంపొందించుకోవడం, స్వీయాత్మక శక్తులను పెంపొందించుకోవడం-సంఘటితపరచుకోవడం, ఉద్యమాన్ని విస్తరించడం, తదితర తక్షణ లక్ష్యాల సాధన కోసం త్యాగనిరతితో పోరాడుతూ ప్రజాయుద్ధాన్ని మరో అడుగు పురోగమింపజేద్దాం.

అమరవీరుల త్యాగాలతోనే గెరిల్లా యుద్ధంలో, ప్రజా ప్రతిఘటనలలో, ప్రజా ఉద్యమాలలో విజయాలు సాధించాం. ప్రజలతో మమేకం అవుతూ చివరి ఊపిరి వరకూ ప్రజల ప్రయోజనాల కోసం శత్రువుతో పోరాడుతూ వారు నెలకొల్పిన ఆదర్శాలు, ప్రజాయుద్ధానికి ఆలంబనగా నిలుస్తున్నాయి. అమరవీరుల త్యాగాల బాటలోనే భారత పీడిత ప్రజలు తమ భవిష్యత్తును వీక్షిస్తున్నారు. మనం వారి ఆశయాలను, ఆదర్శాలను, త్యాగ సంప్రదాయాలను ఎత్తిపడుతూ ఏకమనస్కతతో, ఐక్యకార్యాచరణతో మన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ, సైనిక, సాంస్కృతిక కర్తవ్యాలను సాధించేందుకై దృఢసంకల్పంతో కృషి చేస్తామని శపథం చేద్దాం.

**కామ్రేడ్స్!**

విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో సాగుతున్న మిషన్-2017ను ఓడించి, పై నుంచి కింది వరకూ పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ ఉద్యమాన్ని పురోగమింపజేద్దాం అనే తక్షణ కర్తవ్యంతో అమరవీరుల స్మారక వారాన్ని దేశవ్యాప్తంగా మన ఉద్యమ ప్రాంతాలలో స్ఫూర్తిదాయకంగా జరుపుకుందాం. ఈ స్మారక వారం సందర్భంగా ప్రజల్ని పెద్దయెత్తున కదిలిద్దాం. పార్టీ శ్రేణులలో, పిఎల్‌జిఏ బలగాలలో, గ్రామాలలో మన ప్రియతమ అమరవీరుల గొప్ప త్యాగాలను పెద్దయెత్తున ప్రచారం చేద్దాం. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, వాల్ రైటింగ్, రోడ్ రైటింగ్‌ల ద్వారా, బుక్‌లెట్ల రూపంలో అమరవీరుల చరిత్రలను వెలువరిద్దాం. వారి ఫోటోలను పెద్దయెత్తున ప్రదర్శిద్దాం. వారి ఆదర్శాలను ప్రజలలో చాటి చెబుదాం. గ్రామ, ఏరియా, జిల్లా/డివిజన్/జోన్, రాష్ట్ర/స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్ స్థాయిల్లో సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించి వాటిలో ప్రజలను పెద్దెత్తున సమీకరించడం ద్వారా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిద్దాం. అమరవీరుల త్యాగం, ధైర్య సాహసాలు, దృఢసంకల్పం తదితర ఆదర్శాలను స్మరించుకుంటూ, వాటిని అలవరుచుకుంటూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో నూతన ప్రజాస్వామిక సమాజ నిర్మాణానికై వారి మార్గాన్ని అనుసరించేలా ప్రజల్ని ఉత్తేజపరుద్దాం. అమరుల బాటలో ముందుకు సాగుతామని ప్రతిన బూనుదాం. మన ప్రియతమ అమరవీరులకు మనమివ్వగలిగే నిజమైన శ్రద్ధాంజలి ఇదే.

విప్లవాభినందనలతో,

**కేంద్రకమిటీ,**

జూన్ 3, 2017 **సి.పి.ఐ. (మావోయిస్టు)**